ఉద్యోగ - ఉపాధికల్పనలో పాలకుల ఉద్దేశపూరిత నిర్లక్ష్యం

ఉద్యోగ, ఉపాధి అవకాశాల గురించి దేశంలో, రాష్ట్రంలో చర్చ జరుగుతున్నది. కేంద్ర - రాష్ట్ర పాలకులు దీన్నే అస్త్రంగా ఉపయోగించి రైతుల భూములను బలవంతంగా గుంజుకొంటున్నారు. గత సాధారణ ఎన్నికల్లో ఉద్యోగ, ఉపాధి అంశాన్ని ఎన్‌డిఏ కూటమి తరపున నరేంద్రమోడి, రాష్ట్రంలో తెలుగుదేశం కూటమి తరపున చంద్రబాబునాయుడు విస్తృత ప్రచారంతో నిరుద్యోగ యువతకు భ్రమలు కల్పించారు.

దేశం యువశక్తితో నిండి ఉన్నది. దేశ జనాభాలో 14 సం॥లోపు వారు 30 శాతం, 15-24 సంవత్సరం లోపు 16 శాతం, 25-54 సం॥లోపు 40.6 శాతంగా ఉన్నారని 2014 జూలైనాటి అధికార లెక్కలు తెలియ చేస్తున్నాయి. దీన్ని గమనిస్తే యువశక్తి ఎంతగాఉందీ అర్థమౌతుంది. అపారంగా ఉన్న యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించి వారి శక్తిని ఉపయోగించుకోగలిగి ఉంటే దేశం ఎంతో అభివృద్ధి చెందేది. దేశ ప్రయోజనాలు పట్టని పాలకులు యువత శక్తియుక్తులను నిర్వీర్యం చేస్తున్నారు. ఫలితంగా ఉపాధి అవకాశాలు లేక నిరాశా, నిస్పృహలకు లోనైన యువత బలవన్మరణాలవైపు మళ్ళుతున్నారు.

కేంద్రంలో ఎన్‌డిఏ, రాష్ట్రంలో తెలుగుదేశం కూటములు అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు కావస్తున్నది. ఎన్నికల్లో చేసిన వాగ్దానానికి అనుగుణంగా ఉద్యోగ - ఉపాధి అవకాశాలు కల్పించటంలో రెండు ప్రభుత్వాలు ఘోరంగా విఫలమైనాయి. కొత్తగా ఉపాధి కల్పించకపోగా, ఉన్న ఉపాధిని కూడా లేకుండా చేస్తున్నారు. ఖాళీ అయిన ఉద్యోగాలను కూడా భర్తీ చేయటంలేదు. సెజ్‌లు, కారిడార్లు ఏర్పాటుచేసి పరిశ్రమల ఏర్పాటుకి విదేశీ పెట్టుబడులను ఆహ్వానిస్తున్నామని, తద్వారా పెద్దఎత్తున ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని పాలకులు చేసే ప్రచారంతో యువత విసిగిపోతున్నారు. పాలకుల ఎడల భ్రమలు తొలగిపోతున్నాయి.

ఉద్యోగ ఉపాధి కల్పనపై జాతీయ నమూనా సంస్థ (ఎన్.ఎస్.ఎస్.ఓ) విడుదల చేసిన గణాంకాల ప్రకారం వ్యవసాయంలో ఉపాధి పొందుతున్నవారి సంఖ్య గణనీయంగా తగ్గుతున్నది. 1999-2000 సంవత్సరంలలో వ్యవసాయంలో ఉపాధి 60% ఉండగా 2011-14 నాటికి 49 శాతానికి తగ్గింది. ఈ కాలంలో మూడుకోట్లమంది శ్రామికులు వ్యవసాయ రంగాన్ని వదిలివేశారు. మొత్తం శ్రామికశక్తిలో వ్యవసాయ కూలీల సంఖ్య 56.6 నుండి 48 శాతానికి పడిపోయింది. 2019-20 సం॥నాటికి ఈ శ్రమశక్తి 2.3 కోట్లు తగ్గిపోవచ్చునే అంచనా ఉంది.

భారత ప్రభుత్వ కార్మిక, ఉద్యోగ విభాగం లెక్కల ప్రకారం 1999-2005 సం॥ మధ్యకాలంలో సాలుసరి 1.2 కోట్లమంది కార్మికవర్గంలో చేరారు. 2004-12 సం॥ మధ్యలో ప్రతి సంవత్సరం 75 లక్షల మంది కార్మిక సంఖ్యకు జతపడ్డారు. ఇంత పెద్ద సంఖ్యలో కార్మికవర్గంలోకి కొత్తగా చేరుతుంటే ఉద్యోగ-ఉపాధి కల్పనమాత్రం నామమాత్రంగానే ఉంది. ముఖ్యంగా 2012 తర్వాత ఇది మరింత కుంటుపడింది. 2012లో 7 లక్షల ఉద్యోగాలు కల్పించగా 2013లో 5.5 లక్షలు, 2014 నాటికి 4.9 లక్షలకు ఉద్యోగకల్పన పడిపోయింది. దీన్ని గమనిస్తే కార్మికవర్గంలో కొత్తగా చేరేవారికి వస్తు ఉత్పత్తిరంగం ఉపాధి కల్పించలేకపోతుంది.

ఉద్యోగ -ఉపాధి కల్పనలో యు.పి.ఏ. ప్రభుత్వం విఫలమైందని, తాము అధికారంలోకి వస్తే ప్రతి సంవత్సరం కోటి ఉద్యోగాలు యిస్తామని చెప్పిన ప్రధాని నరేంద్రమోడి దాన్ని అమలుపర్చటంలో పూర్తిగా విఫలమైనాడు. సంఘటితరంగం లేక ప్రైవేట్ రంగం దేనిలోనైనా నిరుద్యోగం తీవ్రరూపం దాలుస్తూనే ఉంది. దేశ లేబర్‌బ్యూరో జరిపిన సర్వే ప్రకారం 2014-15 సంవత్సరం మూడవ త్రైమాసికంలో దేశ ఉపాధివృద్ధి క్షీణించింది. 2014-15 అక్టోబర్ - డిసెంబర్ త్రైమాసికంలో ఆర్థికవ్యవస్థలోని ఎనిమిది కీలకరంగాల్లో 1.17 లక్షల ఉద్యోగాలు కల్పించినట్లు సర్వే రిపోర్టు పేర్కొంది. ఆ సంవత్సరం మూడవ త్రైమాసికంలో ఉద్యోగ అవకాశాలు క్షీణించాయి. ఏప్రిల్ - జూన్ మాసాల్లో 1.82 లక్షల ఉద్యోగాలు లభించగా, జూలై - సెప్టెంబర్ మాసాల్లో 1.58 లక్షలకు పడిపోయింది. 2014-15 ఆర్థిక సంవత్సరంలోని మూడు త్రైమాసికాల్లో ఇదేవిధంగా ఉద్యోగకల్పన ఉంది. 2014-15 సం॥లో 5.40 లక్షల ఉద్యోగాలు కల్పించబడినట్లు చెప్పబడ్డా వీటిల్లో ఎక్కువభాగం ప్రైవేట్‌రంగంలోనే ఉన్నాయి. ఎన్‌డిఏ ప్రభుత్వంలో ఉద్యోగకల్పన గమనిస్తే, కోటి ఉద్యోగాలు కల్పిస్తామన్న వాగ్దానాన్ని నెరవేర్చటంలో మోడి ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది.

ఉద్యోగ - ఉపాధికల్పనలో మోడి ప్రభుత్వ వైఫల్యంపై తీవ్ర విమర్శలతోపాటు, యువతలో అసంతృప్తి వ్యక్తమైంది. యువత అసంతృప్తిని ప్రక్కదారి మళ్ళించేందుకు ప్రధాని మోడి జిమ్మిక్కులు ప్రారంభించాడు. 2015 జూలై 20న భారత కార్మిక సదస్సు సందర్భముగా 'జాతీయ ఉపాధి సేవ' పోర్టల్‌ను ప్రధాని మోడి లాంఛనంగా ప్రారంభించాడు. దీన్ని ఉద్యోగ - కార్మిక మంత్రిత్వశాఖ నిర్వహించింది. ఉద్యోగాల కోసం వచ్చేవారికి, ఉద్యోగాలు కల్పించే యజమానులకు, ఉపాధి, శిక్షణ, సలహా సంప్రదింపుల సంస్థల మధ్య అనుసంధానం ఏర్పరచటం ఈ పథకం ఉద్దేశం. ఈ పథకంలో పేర్లు నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. ఈ పథకం ద్వారా ప్రభుత్వం కొన్ని లక్ష్యాలను ప్రకటించింది. గౌరవప్రదమైన ఉద్యోగం, శ్రమశక్తి నాణ్యతను పెంచటం, మహిళా కార్మికులకు ఎక్కువ అవకాశాలు, ఉద్యోగ విరమణ చేసినవారికి తిరిగి అవకాశం, అసంఘటితరంగం నుండి సంఘటిత రంగానికి కార్మికులను మళ్ళించటం, ఇందుకు నమూనా కేంద్రాలను ఏర్పాటుచేసి, 2016 నాటికల్లా అలాంటి 100 కేంద్రాలు దేశంలో ఏర్పాటు లక్ష్యంగా ప్రభుత్వం ప్రకటించింది. ఉద్యోగాల కోసం వచ్చినవారి వివరాలు సేకరించటం, నిపుణతను బట్టి ఈ కేంద్రాలు ఉద్యోగాలు వెతకటం. ఈ పథకంలో అప్పటికే 3.5 కోట్లమందికి పైగా పేర్లు నమోదు చేసుకొన్నారు.

ఉద్యోగ కల్పనకు సరైన విధానాలు అమలుపర్చని ఎన్‌డిఏ ప్రభుత్వం మాటల గారడీ పథకాలతో నిరుద్యోగ యువతను వంచించ పూనుకొంటున్నది. ఉపాధి సేవా పథకం కూడా అందులో ఒకటి. ఈ పథకం లక్ష్యాలను గమనిస్తే ప్రభుత్వరంగంలో ఉద్యోగకల్పన చేపట్టబోమనే తన ఉద్దేశాన్ని కేంద్ర ప్రభుత్వం వెల్లడించుకొంది. ప్రైవేట్‌రంగంలో ఉద్యోగాలు వెతికిపెడతానంటున్నది. పరిశ్రమాధిపతుల అవసరాలకు అనుగుణంగా అతి తక్కువ వేతనానికి కాంట్రాక్టు ఉద్యోగులను, కూలీలను వారికి అప్పగించటమే ఈ పథకం ఉద్దేశం. నాణ్యత పెంచటం పేరుతో, వారి శ్రమశక్తిని మరింత దోచుకోవటానికి పరిశ్రమాధిపతులకు అవకాశం కల్పిస్తున్నది. ఉద్యోగ విరమణ చేసినవారిని తిరిగి నియమించటమంటే నిరుద్యోగతను ఇంకా పెంచటమే. దేశంలో కోట్లాదిమంది నిరుద్యోగులు, ఉద్యోగాల కోసం ఎదురుచూపులు చూస్తూ ఉన్నారు. ఖాళీ అయిన ఉద్యోగ స్థానాలను నిరుద్యోగులతో భర్తీచేయకుండా, ఉద్యోగ విరమణ చేసినవారిని ఆ స్థానాల్లో తక్కువ వేతనానికి నియమిస్తానంటూ నిరుద్యోగ యువతకు – పదవీవిరమణ చేసినవారికి సంఘర్షణను రాజేస్తున్నది. ఈ చర్య పరిశ్రమాధిపతులకు మేలు చేకూరుస్తుంది. తక్కువ వేతనంతో వారిచే వెట్టిచాకిరీ చేయించుకొని, వారి శ్రమశక్తిని దోచుకొని పెద్దఎత్తున లాభాలు పొందుతారు. ప్రభుత్వ సంస్థల్లో కూడా కాంట్రాక్టు ఉద్యోగాలతో పాటు ఇలాంటి నియామకాలే జరుగుతున్నాయి.

ఇప్పటికే దేశంలోని అన్ని జిల్లాల్లో ఉపాధి కల్పనా కేంద్రాలు ఉన్నాయి. ఇవి ఉద్యోగ అవకాశాలను గుర్తించి పేర్లు నమోదు చేసుకొన్నవారికి సమాచారం అందిస్తున్నాయి. దాని ఆధారంగా నిరుద్యోగులు ఆయా సంస్థల వద్దకు ఉద్యోగాలు కోరుతూ వెళుతూనే ఉన్నారు. అలా వెళ్ళినవారికి నిరాశే మిగులుతున్నది. అప్పటికే ఆ సంస్థలు తమకు అనుకూలమైనవారిని ఉద్యోగాల్లో నియమించుకొంటున్నాయి. ఉపాధి సేవాపథకం కూడా అలాంటిదే. దీని వలన ప్రత్యేకంగా ఒరిగేదేమీ ఉండదు. ఈ పథకం పేరుతో నిరుద్యోగులను మభ్యపెడుతూ ప్రభుత్వం కాలం గడుపుతున్నది.

అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్‌ఓ) అంచనా ప్రకారం 2015-16 మధ్యకాలంలో భారతదేశంలో నిరుద్యోగం 3.5 శాతంగా ఉందని, 2017లోనూ అదే స్థాయిలో ఉంటుందని, ఆ తర్వాత బాగా పెరుగుతుందని అంచనా వేసింది. 2017 సం॥ తర్వాత కొత్తగా ఉద్యోగాలు ఆశించేవారి సంఖ్య ప్రతి సంవత్సరం 1.76 కోట్లవరకు ఉంటుందని ఐఎల్‌ఓ పేర్కొంది. ఇప్పుడు ప్రతి నెలా 10 లక్షల మంది ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్న వారి జాబితాలో చేరుతున్నారు. కేంద్ర కార్మిక శాఖ, ఎంప్లాయ్‌మెంట్ సర్వే ప్రకారం 2015-16 సం॥ మొదటి త్రైమాసికంలో టెక్స్‌టైల్, తోలు పరిశ్రమ, లోహాలు, ఆటోమొబైల్, వజ్రాలు, రవాణా, ఐటి మొదలగు రంగాల్లో 43 వేల ఉద్యోగాలు తగ్గిపోయాయి. దీన్ని గమనిస్తే ఎన్‌డిఏ ప్రభుత్వ ఉద్యోగ కల్పన ప్రచార ఆర్భాటం తప్ప ఆచరణలో లేదు, ఉన్న ఉద్యోగాలే ఊడిపోతున్నాయి.

ఆంధ్రప్రదేశ్‌లో ఉద్యోగ-ఉపాధికల్పన దారుణంగా మారింది. కొత్త నియామకాలు లేవు; ఖాళీ అయిన ఉద్యోగాలు భర్తీ చేయటంలేదు. ఇంటికో ఉద్యోగం, నిరుద్యోగ భృతి అన్న చంద్రబాబు వాగ్దానం అటకెక్కింది. తప్పనిసరి అవసరమైన ప్రాథమిక ఉపాధ్యాయ పోస్టులను కొంతమేరకు, ప్రజా ఉద్యమాలను అణచి వేయటానికి పోలీసు పోస్టులను నియమించటం తప్ప ఇతర రంగాల్లో ఒక్క ప్రభుత్వ ఉద్యోగ నియామకం జరగటంలేదు. రాష్ట్ర విభజన సందర్భంలో ఆంధ్రప్రదేశ్‌లో 1,42,825 ప్రభుత్వ ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని ఆర్థికశాఖ పేర్కొంది. గత రెండు సంవత్సరాలకుపైగా కాలంలో ఉద్యోగ విరమణ చేసినవారిని కూడా కలుపుకొంటే ఖాళీ అయిన పోస్టుల సంఖ్య మరింతగా పెరుగుతుందనుటలో ఎలాంటి సందేహంలేదు. వీటిలో ఒక్క ఉద్యోగాన్నీ రాష్ట్ర ప్రభుత్వం భర్తీ చేయలేదు. తమకు ఉద్యోగాలు కావాలంటూ రాష్ట్రంలో 27.23 లక్షల మంది నిరుద్యోగ యువత పేర్లు నమోదు చేసుకొన్నారు. ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ల సమావేశంలో ప్రభుత్వమే వెల్లడించింది. వీరి సంఖ్య ఏటా 50 వేలు పెరుగుతున్నది.

రాష్ట్ర విభజన సమయంలో ఆంధ్రప్రదేశ్‌కి మంజూరు అయిన ఉద్యోగాలు, ఖాళీ అయిన ఉద్యోగ వివరాలు ఈ విధంగా ఉన్నాయి.

రాష్ట్రస్థాయికేటగిరీ	మంజూరైనవి	ఖాళీలు
గ్రూప్-1	552	184
గెజిటెడ్	11,097	3081
నాన్‌గెజిటెడ్	5422	788
లాస్ట్ గ్రేడ్	34	25
మల్టీ జోనల్		
గ్రూప్-1	187	61
గెజిటెడ్	2496	699
నాన్ గెజిటెడ్	1210	424

రాష్ట్రస్థాయికేటగిరీ	మంజూరైనవి	ఖాళీలు
జోనల్		
గెజిటెడ్	35,652	11,105
నాన్ గెజిటెడ్	45,500	11,353
లాస్ట్ గ్రేడ్	4	4
జిల్లాస్థాయి		
గ్రూప్-1	54	2
గెజిటెడ్	7327	863
నాన్‌గెజిటెడ్	3,86,283	82,760
లాస్ట్ గ్రేడ్	1,75,186	22,519
ఎయిడెడ్	26,617	8,957
మొత్తం	6,97,621	1,42,825

ఆధారం : సాక్షి 18-9-16

ఇంటికో ఉద్యోగం యిస్తానన్న చంద్రబాబు, ఖాళీ అయిన ఉద్యోగ పోస్టులు భర్తీ చేయకపోవటం - ఉద్యోగాలను ప్రైవేటీకరించటానికేనని, అందుకు ప్రపంచబ్యాంక్ సూచనలు కారణమని యువత గ్రహించాలి. ప్రపంచబ్యాంక్‌కు దాసోహమంటున్న చంద్రబాబు ప్రభుత్వాన్ని బోనులో నిలబెట్టాల్సిన బాధ్యత యువతపై ఉంది.

ప్రభుత్వ - ప్రైవేట్‌రంగంలో కాంట్రాక్టు ఉద్యగ నియామకాలలో ఉద్యోగ భద్రత లేని విధానాలను కేంద్ర - రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్నాయి. వైద్య రంగంలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను తొలగిస్తూ జిల్లాల ఆసుపత్రులు తీసుకొన్న నిర్ణయాలను వ్యతిరేకిస్తూ ఆ రంగ ఉద్యోగులు హైకోర్టులో పిటిషన్‌ను వేశారు. దీనిపై సుదీర్ఘ విచారణ జరిగింది. ఉద్యోగ నియామకాల్లో ఔట్‌సోర్సింగ్ విధానంపై హైకోర్టు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఖాళీలను శాశ్వత ప్రాతిపదికన భర్తీ చేయకుండా ఔట్‌సోర్సింగ్ విధానాన్ని ఇంకెన్నాళ్ళు కొనసాగిస్తారని నిలదీసి, నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వకపోవటాన్ని ప్రశ్నించింది. ఉద్యోగ నియామకాలలో ఔట్‌సోర్సింగ్ విధానం సరైందికాదని చెప్పింది. వైద్యరంగంలో ఔట్‌సోర్సింగ్ విధానం రాజ్యాంగ విరుద్ధమని స్పష్టం చేసింది. ప్రభుత్వ ఆసుపత్రులలో మంజూరైన ఉద్యోగాలను శాశ్వత ప్రాతిపదికన 6 నెలల్లో భర్తీచేయాలని న్యాయమూర్తి ఎ. రామలింగేశ్వర రావు తీర్పు వెలువరించారు. ఔట్‌సోర్సింగ్ విధానంపై 1994లో తీసుకొచ్చిన ఆంధ్రప్రదేశ్ (రెగ్యులేషన్ ఆఫ్ అపాయింట్‌మెంట్స్ టు పబ్లిక్ సర్వీసెస్ అండ్ రేషనలైజేషన్ ఆఫ్ స్టాఫ్ పాట్రన్ అండ్ పే స్ట్రక్చర్) చట్టం నిరుద్యోగుల ప్రయోజనాలను దెబ్బతీస్తుందని పేర్కొన్న విషయాన్ని న్యాయమూర్తి గుర్తుచేశారు. 1994లో రోజువారీ వేతన నియామకాలను, తాత్కాలిక నియామకాలను నిషేధిస్తూ అప్పటి ప్రభుత్వం చట్టం చేసింది. అందుకు విరుద్ధంగా ఔట్‌సోర్సింగ్ విధానానికి సంబంధించి తెలుగుదేశం ప్రభుత్వం 2016 ఆగస్టు 8న సమగ్ర మార్గదర్శకాలతో జీవో 151 జారీ చేసింది.

రాష్ట్రాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేసి ఉద్యోగ ఉపాధి కల్పించేపేరున సెజ్‌లు, కోస్టల్ కారిడార్‌లు, విమానాశ్రయాలు, ఓడరేవుల ఏర్పాటుకి దేశ, విదేశీ బడా పెట్టుబడిదారులను ఆహ్వానిస్తూ లక్షలాది ఎకరాలను రైతుల నుండి బలవంతంగా గుంజుకొని వారికి చంద్రబాబు ప్రభుత్వం కట్టబెట్టేందుకు అన్ని ఏర్పాట్లు చేసింది. అందుకు 12 లక్షల ఎకరాలతో భూ బ్యాంక్ ఏర్పాటు చేసింది. ప్రభుత్వం చెబుతున్న విధంగా పెట్టుబడులు రావటంలేదు. పరిశ్రమలు ఏర్పాటు కావటంలేదు. ఉద్యోగ - ఉపాధి లభించటంలేదు. 30 వేల కోట్ల భారీ ప్రాజెక్టు పెట్టటానికి ముందుకొచ్చిన ఆస్ట్రేలియాకు చెందిన క్విన్స్‌లాండ్ కోల్ కార్పొరేషన్ ప్రాజెక్టు కాగితాలకే పరిమితమైంది. రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్ (ఆర్.ఐ.ఎన్.ఎల్ - వైజాగ్ స్టీల్) 38,500 కోట్ల విస్తరణ సంబంధించిన పనులు మూలన పడ్డాయి. దక్షిణాదిలో ప్లాంట్ పెడతామన్న హీరో మోటార్స్ కార్ప్‌కు ఉచితంగా భూమి యిచ్చినా, అదీ ప్రారంభం కాలేదు. 2020 నాటికి ఐటీరంగంలో 40 వేల కోట్ల పెట్టుబడులను రాబట్టి నాలుగు లక్షలమందికి ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్న లక్ష్యాన్ని 2014లో ఆర్భాటంగా విడుదలచేసిన ఐటీ పాలసీ విడుదలై రెండు సంవత్సరాలు గడిచిపోయినా ఒక్క ప్రాజెక్టు రాలేదు. రాష్ట్రంలో పెట్టుబడులకు కంపెనీలు ఎంవోయులు (అవగాహనకు రావటం) చేసుకొంటున్నాయి గాని అందులో ఏ ఒక్కటి పునాదిరాళ్ళ స్థాయిని కూడా దాటలేదని ఆంధ్రప్రదేశ్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ ఫెడరేషన్ స్పష్టం చేసింది. రాష్ట్ర విభజన నాటికి 1,06,552 పరిశ్రమ యూనిట్లు ఉంటే 2014-15లో కొత్తగా వచ్చిన ప్రతిపాదనలు 2,847 మాత్రమే. వీనిలో దరఖాస్తులే ఎక్కువ. లక్షలాది కోట్ల రూపాయల పెట్టుబడులు విదేశాల నుండి వస్తున్నాయని సంవత్సరానికి 3.5 లక్షల ఉద్యోగాలు వస్తాయని రాష్ట్ర ప్రభుత్వం ప్రచారం చేస్తున్నప్పటికీ వచ్చింది నామమాత్రంగానే ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో సెజ్‌ల ఏర్పాటు ద్వారా 16 లక్షల 78 వేల ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పి లక్షా 27 వేల ఎకరాలను పారిశ్రామికవేత్తలకు కట్టబెట్టినప్పటికీ ఉద్యోగాలు వచ్చింది లక్షా 13 వేలు మాత్రమే. ఇందులో అత్యధిక భాగం గుమస్తాలు, ప్యూన్ ఉద్యోగాలే. సెజ్‌ల ఏర్పాటు ద్వారా లభించిన ఉద్యోగాలకన్నా, ఉపాధి కోల్పోయిన వారి సంఖ్య చాలా ఎక్కువగా ఉంది. చంద్రబాబు పరిశ్రమల

ఏర్పాటు రైతుల భూములను లాక్కోవటానికి తప్ప ఉద్యోగ – ఉపాధి కల్పించటం కోసం కాదు. అందుకోసమే అయితే పరిశ్రమల ఏర్పాటు, భూసేకరణ మరోవిధంగా ఉండేది.

తాము ప్రాతినిధ్యం వహించేవర్గాల ప్రయోజనాలు కాపాడటమే పాలకుల విధానంగా ఉంటుంది. కేంద్ర – రాష్ట్ర పాలకులు సామ్రాజ్యవాదుల, బడా పెట్టుబడిదారుల, భూస్వాముల దోపిడీ ప్రయోజనాలకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అందుకు అనుగుణమైన విధానాలు అమలుచేస్తారు. పారిశ్రామిక విధానం, ఉద్యోగ, ఉపాధికల్పన ఆ విధానాలకు లోబడే ఉంటుంది. దాని ఫలితంగానే స్వతంత్ర పారిశ్రామిక విధానం ద్వారా ఉద్యోగ – ఉపాధికల్పన చేపట్టలేక పోతున్నారు. సామ్రాజ్యవాదుల, బడా పరిశ్రమాధిపతుల ప్రయోజనాలకు అనుగుణమైన పారిశ్రామిక విధానాన్ని అమలుజరుపుతూ, అదే నిరుద్యోగ సమస్యకు పరిష్కారంగా ప్రచారం చేస్తున్నారు. లక్షలాది ఎకరాల భూములు వారిపరం చేస్తున్నారు. ఈవిధానం నిరుద్యోగ సమస్యను మరింతగా పెంచుతూనే ఉంది. ఉద్యోగ, ఉపాధి అన్నది గ్రామీణ ప్రాంతంతో ముడిపడి ఉంది. ఇప్పటికే 68 శాతం ప్రజలు వ్యవసాయమే జీవనాధారంగా గ్రామాల్లో నివశిస్తున్నారు. వారి జీవన పరిస్థితులు మెరుగుపడే విధానాలు అమలుజరగాలి. విప్లవ భూసంస్కరణలు అమలుజరిపి పేదలకు భూములు పంచటం, పంటలకు న్యాయమైన ధరలు ప్రకటించటం, ఉత్పత్తి ఖర్చులు తగ్గించటం, మార్కెట్ సౌకర్యం కల్పించటం చేయాలి. అందుకు అనుగుణంగా వ్యవసాయాధారిత పరిశ్రమలు నెలకొల్పాలి. వాటి ద్వారా గ్రామీణ పేదలకు ఉద్యోగ – ఉపాధి కల్పించాలి. ఫలితంగా గ్రామీణ పేదల వలసలు నివారించబడతాయి. దీని వలన పట్టణ ప్రాంతంలో కార్మికులకు, కూలీలకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. అప్పుడు గ్రామీణ, పట్టణ ప్రజల ఆర్థిక పరిస్థితి అభివృద్ధిచెంది వారికి అవసరమైన వస్తువులు కొనుగోలు చేయగలుగుతారు. అందుకు అనుగుణంగా పారిశ్రామిక అభివృద్ధి జరుగుతుంది. ఇలాంటి విధానాలు అమలుపర్చటమే నిరుద్యోగ సమస్యకు, ఉద్యోగ – ఉపాధికల్పనకు పరిష్కారం. అలాంటి విధానాలు అమలు జరపని పాలకులకు వ్యతిరేకంగా గ్రామీణ – పట్టణ పేదలు, రైతాంగం, కార్మికులు, విద్యార్థి యువజనులు సమైక్యంగా ఉద్యమించాలి.

ooooo